జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ‖సంపుటి:1 ‖ సంచిక: 33 ‖ గురువారం ‖ 2-7-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-





# హైదరాబాద్‌ను స్మార్ట్ ట్రాఫిక్ నగరంగా తీర్చిదిద్దేందుకు అడుగులు

**అనలాగ్--ఎంఈఐఎల్ భాగస్వామ్యంతో సీఎం రేవంత్ సమక్షంలో ఎంఓయూ**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను అత్యాధునిక సాంకేతికతతో కూడిన స్మార్ట్ నగరంగా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగు పడింది. ముఖ్యమంత్రిశ్రీ. రేవంత్ రెడ్డి సమక్షంలో అనలాగ్ సంస్థ, మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (MEIL) సంయుక్త భాగస్వామ్యంతో అవగాహన ఒప్పందం (MoU) కుదిరింది.

హైదరాబాద్, జూలై 1: ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్ లో జరిగిన సమావేశంలో అనలాగ్ వ్యవస్థా పకుడు, సీఈఓ అలెగ్జా కిప్మాన్ , ఎంఈఐ ఎల్ ఎండీ పి . కృష్ణ రెడ్డి ముఖ్యమంత్రిని కలిసి సంయుక్తంగా చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రులు చీ. ఉత్తమ్ కుమార్ రెడ్డి , జూపల్లి కృష్ణ రావు , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో నెక్స్ట్ జనరేషన్ ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సాంకేతిక పరిష్కారాలపై సంస్థలు ప్రజెంటేషన్ ఇచ్చాయి. ముఖ్యంగా హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు ద్వారా ట్రాఫిక్ రద్దీని గుర్తించి సిగ్నళ్లను స్వయంచాలకంగా నియంత్రించడం, నీటి లీకేజీలను ముందుగానే గుర్తించడం, విద్యుత్ వినియోగాన్ని అవసరానికి అనుగుణంగా నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు తక్షణ మార్గం కల్పించడం వంటి అంశాలను వివరించాయి.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. నగరంలోని అన్ని ట్రాఫిక్ సిగ్నళ్లను సమగ్ర వ్యవస్థలోకి తీసుకురావాలని, ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నళ్లు స్వయంచాలకంగా పనిచేసే విధానాన్ని (మిగతా 4వ పేజీలో)

# ఆదాయ సమీకరణపై శాఖలు సీరియస్‌గా పనిచేయాలి

**అడ్డుకట్ట వేయాలి.. వాస్తవిక బడ్జెట్ రూపొందించాలి: సీఎం రేవంత్ రెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణ, బడ్జెట్ లక్ష్యాల సాధనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ (MCRHRD)లో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్, జూలై 1: ఈ సంద ర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలను చేరుకోవాలంటే ఆదాయ సమీకరణపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముఖ్యంగా హెచ్ఎండీఏ (HMDA), టీజీఐఐసీ (TGIIC) సంస్థలు ఆదాయ వనరులను పెంచేందుకు (మిగతా 4వ పేజీలో)



# యూరియా యాప్‌తో 6 వేల ఎరువుల బస్తాల అక్రమం బట్టబయలు

**మంత్రి తుమ్మల**

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఫర్టిలైజర్ (యూరియా) యాప్ ద్వారా సిద్ధిపేట జిల్లాలో 6 వేల యూరియా బస్తాల అక్రమ పంపిణీ వెలుగులోకి వచ్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

హైదరాబాద్, జూలై 1 : ఈ అక్రమాలకు బాధ్యులైన ఇద్దరు టోకు ఎరువుల డీలర్లు, ఒక రిటైల్ డీలర్ లైసెన్సులను రద్దు చేసినట్లు మంత్రి వెల్లడించారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టులు చేసినట్లు, విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఒక (మిగతా 4వ పేజీలో)



# మహిళా సాధికారతే దేశాభివృద్ధికి బలమైన పునాది

**గవర్నర్ శివప్రతాప్ శుక్లా**

హైదరాబాద్, జూలై 1: అభివృద్ధి చెందిన, సమగ్ర భారత నిర్మాణానికి మహిళా సాధికారతే అత్యంత బలమైన పునాదని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అన్నారు. దేశ ఆర్థికాభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికీ చేరేలా ప్రభుత్వం, సామాజిక సంస్థలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఐఈ. ఎంసీర్ హె చ్ ర్ డిలో ఆంధ్ర ప్రదేశ్ మహిళా అభివృద్ధి సొసైటీ రజతోత్సవాల సందర్భంగా నిర్వహించిన "సమగ్రాభి వృద్ధికి సమాజ ఆధారిత మార్గాలు" అనే రెండు రోజుల జాతీయ సదస్సును బుధవారం గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి, మహిళల సాధికారత, రైతు సంస్థల బలోపేతానికి 25 ఏళ్లుగా (మిగతా 4వ పేజీలో)



# జీవితాంతం నేర్చుకునే తత్వాన్ని అలవర్చుకోవాలి

**సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపు**

అనంతపురం, జూలై 1: విద్యతో నేర్చుకో వడం ముగియదని, జీవితాంతం కొత్త విషయాలను తెలుసుకుంటూ, కొత్త ఆలోచనలను అన్వేషించే ధైర్యాన్ని ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది మూర్ము పిలుపునిచ్చారు. అనంతపురంలో (మిగతా 4వ పేజీలో)





# చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతున్న ‘సామాజిక న్యాయ సమరభేరి’

**భువనగిరిలో జోరుగా ఏర్పాట్లు.. రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తల్లో ఉత్సాహం**

జూలై 5న భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న ‘సామాజిక న్యాయ సమరభేరి’ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. కార్యక్రమ ఇన్‌చార్జి వట్టే జానయ్య యాదవ్ పర్యవేక్షణలో సభా వేదిక నిర్మాణం, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, భద్రత, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి.

భువనగిరి, జూలై 1: సభా ప్రాంగణంలో సామాజిక న్యాయ ఉద్యమానికి సంబంధించిన మహనీ యుల చిత్రపటాలు, భారీ కటౌట్లు, ఆకర్షణీయమైన స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయడంతో పాటు వేలాది మంది ప్రజలు హాజరయ్యేలా అన్ని వసతులు కల్పిస్తు న్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గత నెల రోజులుగా గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించిన విస్తృత ప్రచార కార్యక్రమాలకు ఈ మహాసభ (మిగతా 4వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

**మేషం :** ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ప్రారంభించిన కార్యక్రమాలు నెరవేరుతాయి. గౌరవం, గుర్తింపు పెరుగుతాయి. ధనలాభ సూచనలు ఉన్నాయి. గోవింద నామస్మరణ శుభప్రదం.

**వృషభం :** మనోధైర్యాన్ని నిలబెట్టుకొని సానుకూల దృక్పథంతో వ్యవహరించండి. ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతతను ఇస్తుంది. కుటుంబంలో సహనం అవసరం. దుర్గాదేవి ఆరాధన మేలు చేస్తుంది.

**మిథునం :** పట్టుదల, ఆత్మవిశ్వాసం విజయానికి మార్గం చూపుతాయి. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో ప్రోత్సాహకర పరిస్థితులు ఉంటాయి. శ్రీసుబ్రహ్మణ్యస్వామి స్మరణ శుభప్రదం.

**కర్కాటకం :** అభివృద్ధికి దారితీసే అవకాశాలు లభిస్తాయి. పెద్దల ఆశీస్సులు, మార్గదర్శనం కలిసి వస్తాయి. సానుకూల ఆలోచనతో ముందుకు సాగండి. శ్రీలక్ష్మీ అష్టోత్తర పారాయణం మేలు చేస్తుంది.

**సింహం :** సహనం, సంయమనం మీ బలంగా నిలుస్తాయి. ఖర్చులపై నియంత్రణ పాటించండి. ఒత్తిడికి లొంగకుండా ప్రశాంతంగా వ్యవహరించండి. నవగ్రహ శ్లోకాలు చదవండి.

**కన్య :** కార్యసిద్ధి కలుగుతుంది. మంచి ఆలోచనలు విజయవంతం అవుతాయి. ఆత్మీయుల సహకారంతో లక్ష్యాలను చేరుకుంటారు. గురుధ్యానం శుభప్రదం.

**తుల :** పట్టుదలతో కృషి చేస్తే ఫలితం లభిస్తుంది. అనుభవజ్ఞుల సలహా తీసుకోవడం మంచిది. సమయాన్ని సద్వినియోగం చేసుకోండి. నవగ్రహ ధ్యానం మేలు చేస్తుంది.

**వృశ్చికం :** మనోబలం, ఆత్మవిశ్వాసం విజయాన్ని అందిస్తాయి. ప్రారంభించిన పనులు అనుకూలంగా పూర్తవుతాయి. విష్ణు సహస్రనామ పారాయణం శుభప్రదం.

**ధనుస్సు :** పట్టుదలతో ప్రయత్నిస్తే కార్యసిద్ధి కలుగుతుంది. ఆర్థికంగా అనుకూలత ఉంటుంది. ప్రశాంతమైన వైఖరి మీ విజయాన్ని పెంచుతుంది. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనం మేలు చేస్తుంది.

**మకరం :** వృత్తి, ఉద్యోగాల్లో మంచి ఫలితాలు సాధిస్తారు. ఒక శుభవార్త ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. అనవసర ఖర్చులను తగ్గించండి. శ్రీఆంజనేయస్వామి ఆరాధన శుభప్రదం.

**కుంభం :** ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తే విజయాలు మీ సొంతం అవుతాయి. బంధుమిత్రుల సహకారం లభిస్తుంది. స్థిరాస్తి విషయాల్లో అనుకూలత ఉంటుంది. ఇష్టదైవ నామస్మరణ మేలు చేస్తుంది.

**మీనం :** దైవబలం, ఆత్మవిశ్వాసం కలిసి వస్తాయి. ఆశయాలు నెరవేరే అవకాశాలు ఉన్నాయి. కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే విజయాలు సాధిస్తారు. శ్రీలక్ష్మీదేవి ఆరాధన శుభప్రదం.



# మహిళా సాధికారతే దేశాభివృద్ధికి బలమైన పునాది

(మొదటి పేజీ తరువాయి)

అంకితభావంతో సేవలందిస్తున్న ఏపీఎంఏఎస్‌ను అభినందించారు. సంస్థ రజతోత్సవం కేవలం 25 ఏళ్ల ప్రయాణానికి గుర్తు మాత్రమే కాకుండా, విశ్వాసం, సేవా తత్వం, నవీన ఆలోచనలు, సామాజిక మార్పునకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

దేశంలో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఉద్యమం ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక అభివృద్ధి ఉద్యమాల్లో ఒకటిగా ఎదిగిందని ఆయన అన్నారు. 2025 మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా 17 కోట్లకు పైగా గ్రామీణ కుటుంబాలు స్వయం సహాయక సంఘాల పరిధిలోకి వచ్చాయని, 1.43 కోట్ల సంఘాలు బ్యాంకులతో అనుసంధానమై రూ.3.04 లక్షల కోట్లకు పైగా రుణాలు పొందాయని తెలిపారు. ఇది కేవలం ఆర్థిక చేరిక మాత్రమే కాకుండా మహిళా నాయకత్వం, గ్రామీణ పారిశ్రామికత, సామాజిక పరివర్తనకు నిదర్శనమని పేర్కొన్నారు.

తెలంగాణలో మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతంలో ఏపీఎంఏఎస్ కీలక పాత్ర పోషించిందని గవర్నర్ తెలిపారు. రాష్ట్రంలో 6 లక్షలకు పైగా స్వయం సహాయక సంఘాలు, 23 వేల సమాఖ్యలు, సుమారు 67 లక్షల మహిళా సభ్యులకు సంస్థ తోడ్పాటు అందించిందని చెప్పారు. అలాగే గ్రామీణ మహిళలకు తక్కువ వడ్డీతో రుణాలు అందించే కమ్యూనిటీ ఆధారిత ఆర్థిక సంస్థ స్త్రీనిధి ఏర్పాటులో కూడా ఏపీఎంఏఎస్ విశేష కృషి చేసిందని కొనియాడారు. 2026 మార్చి 31 నాటికి స్త్రీనిధి ద్వారా సుమారు 32 లక్షల మంది మహిళలకు రూ.25 వేల కోట్లకు పైగా రుణాలు అందించి గ్రామీణ ప్రాంతాల్లో సంస్థాగత రుణాల అందుబాటును గణనీయంగా పెంచిందని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం ఏపీఎంఏఎస్ 86 రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు (ఎఫ్‌పీఓలు) మద్దతు అందిస్తూ, దాదాపు 40 వేల మంది చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ విలువ గొలుసులను బలోపేతం చేసి జీవనోపాధిని మెరుగుపరుస్తోందని గవర్నర్ పేర్కొన్నారు.

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే "తెలంగాణ రైజింగ్--2047" లక్ష్య సాధనకు ప్రభుత్వం, సామాజిక సంస్థలు, కమ్యూనిటీ సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సహజ వ్యవసాయం, నీటి సంరక్షణ, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు, వాతావరణ మార్పులకు అనుగుణమైన సాంకేతికత, రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు.



## ..శాఖలు సీరియస్‌గా పనిచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్, మైనింగ్‌తో పాటు ఇతర శాఖల్లో ఆదాయ లీకేజీలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆదాయ సమీకరణను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక "చేజింగ్ సెల్" ఏర్పాటు చేసి, లక్ష్యాల సాధనపై నిరంతర ఫాలోఅప్ నిర్వహించాలని ఆదేశించారు. శాఖల పనితీరును మెరుగుపర్చేందుకు ఆయా విభాగాల సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత కోసం కృత్రిమ మేధస్సు (ఏఐ×) సాంకేతికతను వినియోగించి లబ్ధిదారుల వివరాలను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (ఐడీ) వ్యవస్థతో అనుసంధానం చేయాలని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు పూర్తి అయ్యేలా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించాలని, ఊహాజనిత అంచనాలకు తావులేకుండా వాస్తవికత ఆధారంగానే ఆర్థిక ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు. భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు ఉండదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను హెచ్చరించారు.

## జగన్నాథ రథయాత్ర పరిచయ పత్రికను విడుదల చేసిన ఇస్కాన్ నరహరి ప్రభుజీ

కరీంనగర్ : రాబోయే జగన్నాథ రథయాత్రకు సంబంధించిన పరిచజగన్నాథ రథయాత్ర పరిచయ పత్రికను విడుదల చేసిన ఇస్కాన్ నరహరి ప్రభుజీ

కరీంనగర్ రాబోయే జగన్నాథ రథయాత్రకు సంబంధించిన పరిచయ పత్రికను ఇస్కాన్ నరహరి ప్రభుజీ గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జగన్నాథ రథయాత్ర కమిటీ అధ్యక్షుడు కన్నా కృష్ణ, ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ దారం రఘురాం పాల్గొన్నారు.దఈ సందర్భంగా నరహరి ప్రభుజీ మాట్లాడుతూ, పూరీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవితో కూడిన జగన్నాథ రథయాత్ర ప్రతి ఏడాది ఆషాఢ శుక్ల విదియ రోజున పూరీతో పాటు దేశవ్యాప్తంగా అనేక నగరాలు, గ్రామాల్లో అత్యంత వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఏడాది జూలై 16న పూరీలో ప్రారంభమయ్యే రథయాత్ర తొమ్మిది రోజుల పాటు కొనసాగి జూలై 24న ముగుస్తుందని చెప్పారు. అదే పుణ్యదినాన కరీంనగర్‌లో కూడా జగన్నాథ రథయాత్రను ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ దారం రఘురాం చొరవతో ముద్రించిన ఈ రంగురంగుల పరిచయ పత్రికలో జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి రథయాత్రకు సంబంధించిన చరిత్ర, ఆధ్యాత్మిక విశిష్టతను సరళమైన తెలుగు భాషలో వివరించడం అభినందనీయమని నరహరి ప్రభుజీ పేర్కొన్నారు. డాక్టర్ దారం రఘురాం మాట్లాడుతూ, కరీంనగర్ పురవీధుల్లో జగన్నాథ రథయాత్రను కన్నులపండువగా నిర్వహించడం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తుందని, ఇందుకోసం కృషి చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎల్. రాజభాస్కర్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొని డాక్టర్ దారం రఘురాంకు కృతజ్ఞతలు తెలిపారు.య పత్రికను ఇస్కాన్ నరహరి ప్రభుజీ గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జగన్నాథ రథయాత్ర కమిటీ అధ్యక్షుడు కన్నా కృష్ణ, ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ దారం రఘురాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరహరి

## 6 వేల ఎరువుల బస్తాల అక్రమం బట్టబయలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ అధికారిపై శాఖాపరమైన చర్యలు కూడా ప్రారంభించినట్లు చెప్పారు. ఇదే తరహా అక్రమాలు కామారెడ్డి జిల్లాలో కూడా గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకున్నామని తెలిపారు.

యూరియా యాప్ ద్వారా ఎరువుల పంపిణీ ప్రక్రియ పూర్తిగా డిజిటల్ పద్ధతిలో పర్యవేక్షించబడుతోందని, దీంతో నకిలీ బిల్లులు, అక్రమ నిల్వలు, సబ్సిడీ ఎరువుల మళ్లింపును సమర్థంగా అరికట్టగలుగుతున్నామని మంత్రి పేర్కొన్నారు. రైతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ యూరియాను దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్రంలో ప్రస్తుతం 3.64 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 6 లక్షల మెట్రిక్ టన్నులలో ఇప్పటికే 5.62 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి చేరాయని వెల్లడించారు. యూరియా యాప్ ద్వారా రైతులు ఇప్పటివరకు 52.30 లక్షల యూరియా బస్తాలను బుక్ చేసుకోగా, వాటిలో 46.03 లక్షల బస్తాలను కొనుగోలు చేశారని, ఇంకా 79.29 లక్షల యూరియా బస్తాలు రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు.

## హైదరాబాద్‌ను స్మార్ట్ ట్రాఫిక్ నగరంగా తీర్చిదిద్దేందుకు అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకుని కృత్రిమ మేధ (ఏఐ×) ఆధారంగా ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

సమావేశం అనంతరం ముఖ్యమంత్రి సమక్షంలో అనలాగ్--ఎంఈఐఎల్ సంస్థలు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ద్వారా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వ సేవల సామర్థ్య పెంపు, డేటా ఆధారిత నగర ప్రణాళికకు మరింత ఊతం లభించనుంది.

## చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతున్న 'సామాజిక న్యాయ సమరభేరి'

(మొదటి పేజీ తరువాయి)

పరాకాష్ఠగా నిలవనుంది. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, జనాభాకు తగిన రాజకీయ భాగస్వామ్యం వంటి అంశాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లే వేదికగా ఈ సభ నిలుస్తుందని నిర్వాహకులు భావిస్తున్నారు.

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను సభకు ఆహ్వానిస్తున్నాయి. గ్రామ గ్రామాన ప్రచార యాత్రలు, సమావేశాలు, కరపత్రాల పంపిణీ, సోషల్ మీడియా ప్రచారం ద్వారా సభపై ఆసక్తిని పెంచుతున్నారు. జిల్లాల వారీగా వాహనాల ఏర్పాటు, ప్రతినిధుల సమన్వయం, వాలంటీర్ల నియామకం వంటి ఏర్పాట్లు కూడా పూర్తిచేసే దశకు చేరుకున్నాయి.

సామాజిక న్యాయం సాధన దిశగా ఒక మైలురాయిగా నిలిచే ఈ 'సామాజిక న్యాయ సమరభేరి' తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక చర్చకు దారితీసే సభగా మారుతుందనే అభిప్రాయం కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, సామాజిక న్యాయ ఉద్యమకారులు హాజరుకానున్న నేపథ్యంలో భువనగిరి వేదిక చారిత్రక సభకు సిద్ధమవుతోంది.

# జీవితాంతం నేర్చుకునే తత్వాన్ని అలవర్చుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం నిర్వహించిన సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తొలి స్నాతకోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న తొలి స్నాతకోత్సవం సంస్థ అభివృద్ధి ప్రయాణంలో ఒక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్న ఆమె, నాణ్యమైన విద్యను లక్ష్యంగా చేసుకుని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉండే విద్యా కేంద్రంగా ఈ విశ్వవిద్యాలయం ఎదగాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో ఈ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషిస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

డిగ్రీలు అందుకున్న విద్యార్థులకు అభినందనలు తెలిపిన రాష్ట్రపతి, వారి విజయం కేవలం వారి కృషి ఫలితం మాత్రమే కాదని, తల్లిదండ్రుల త్యాగం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, సమాజం అందించిన సహకారం కూడా అందులో భాగమని అన్నారు. విద్య ద్వారా ఉపాధి అవకాశాలను సృష్టించడం, వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టడం, సమాజ సేవ చేయడం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం ద్వారా సమాజానికి తిరిగి సేవ చేయాలని సూచించారు.

సాంకేతిక రంగంలో వేగంగా జరుగుతున్న మార్పుల నేపథ్యంలో డిగ్రీతోనే విద్య పూర్తయిందని భావించకుండా, కొత్త సాంకేతికతలను స్వీకరిస్తూ, నిరంతరం కొత్త జ్ఞానాన్ని సంపాదించే తత్వాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.

నిజాయితీ, కరుణ, సహానుభూతి, ప్రకృతి పట్ల గౌరవం వంటి నైతిక విలువలు సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి, బాధ్యతాయుతమైన పౌరసత్వానికి పునాది అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

భారత యువతే దేశానికి అతిపెద్ద బలమని, వారి సృజనాత్మకత, పట్టుదల, అంకితభావం దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను అవకాశాలుగా మార్చగలవని తెలిపారు. ప్రతి రంగంలోనూ నిబద్ధత, నిజాయితీతో రాణిస్తూ దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పట్టభద్రులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.

# శ్వేత సంపాదకీయం

బుధవారం 1-7-2026

## ఉపాధి లక్ష్యం మారితేనే గ్రామాలకు మహర్దశ !

ఉపాధి హామీ పథకం పేరు మారింది. నింబంధనలు మార్చిన కేంద్రం ప్రభుత్వం వీబీజీరామ్‌జీ అంటే వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ పేరుతో కొత్త పథకాన్ని అమల్లోకి తీసుకుని వచ్చింది. పథకం పేరు మారినా పెద్దగా మారిందేమీ ఉండకపోవచ్చు. ఇందులో గతంలో కేంద్రం 90శాతం నిధులు, రాష్ట్రాలు పదిశాతం నిధులు భరించేవి. కానీ ఇప్పుడు కేంద్రం 60శాతం, రాష్ట్రాలు 40శాతం నిధులు భరించేలా మార్పులు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి ఉపాధి కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2006లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టుంది. కూలీలకు ఉపాధి కల్పించే పథకంగా పేరు సంతరించుకున్న ఉపాధి హామీ పథకం ఇక వీబీజీరామ్‌జీ పేరుతో జులై1 నుంచి అమలు చేయనున్నారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులను సమకూర్చేవి. వీబీజీరామ్‌జీకి కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించనున్నాయి. ఈలెక్కన రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం అదనంగా నిధులు భరించాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పథకం అమలుతో వలసలు తగ్గడంతో పాటు,గ్రామీణప్రాంత ప్రజలకు ఎంతోకొంత ప్రయోజనకరంగా మారింది. వీబీజీరామ్‌జీతో ఉపాధి కూలీలకు మేలు చేకూరనుంది. పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచారు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే, వేలకోట్లు ఖర్చు చేసినా గ్రామాల్లో పెద్దగా మార్పులు కానరాలేదు. ఈ పథకం పేరు మార్చిన పెద్దలు విధానలను పట్టించుకున్నట్లుగా లేదు. గ్రామాల్లో ఇప్పుడు వ్యవసాయ కూలీల కొరవ ఉంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు వెనక్కి పోయాయి. భూగర్భ జలాలు అడుగంటాయి.

చెరువులు కుంటలు మాయం అవుతున్నాయి. పచ్చదనం పగటికలగా మారింది. పర్యావరణ విధ్వంసం యధావిధిగా సాగుతోంది. చెరువుల పునరుద్దరణ సాగాలి. నాలాల పూడికతీతలు చేయాలి. వాననీటి సంరక్షణ పథకాలు చేపట్టాలి. ఈ క్రమంలో వీటన్నింటిని ఇందులో చేర్చి పక్కాగా కొత్త పథకం ద్వారా దేశ నిర్మాణం చేయగల గాలి. అప్పుడే వెచ్చించిన డబ్బులకు ప్రతిఫలం దక్కుతుంది. కేవలం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఏదో ఒక పనిచేయించామన్న రీతిలో పథకం సాగరాదు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు వేతనాలు ఆలస్యమయ్యేవి. ఒక్కోసారి నెలలు గడిచినా డబ్బులు జమయ్యేవి కావు. నూతన పథకంలో వేతనాలు ఆలస్యమైతే కూలీలకు పరిహారం చెల్లించనున్నారు. పనిచేసిన తరువాత 15 రోజుల్లో కూలీల బ్యాంకు ఖాతాల్లో వేతనం జమ చేయనున్నారు. అలస్యమైతే పరిహారం ఇవ్వనున్నారు. గతంలో కాకుండా ప్రతి కుటుంబానికి 125 రోజులు పని దినాలు కల్పించనున్నారు. వీబీజీరామ్‌జీ పథకాన్ని మూడుగా విభజించారు. పనుల్లో పారదర్శకత పెంచడడంతోపాటు అరు నెలలకోసారి సామాజిక తనిఖీలు చేయనున్నారు. వేతనాల చెల్లింపు వివరాలను బహిరంగంగా వెల్లడించ నున్నారు. ఫిర్యాదుల స్వీకరణకు సరికొత్త వ్యవస్థలను వినియోగంలోకి తీసుకురానున్నారు. కొత్త పథకంపై తెలంగాణ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఇటీవల కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలో జరిగిన భేటీలో మంత్రి సీతక్క తమ అభ్యంతరాలను తెలియచేసింది. కేంద్రం కూడా రాష్ట్రాల అభ్యంతరాలతో పాటు, పనుల నిర్వహణపై సూచనలు సలహాలు తీసుకుని ఉంటే బాగుంటుంది. ఎందుకంటే చేపట్టే పనులు గ్రామాల ఆర్థిక పరిస్థితిని మార్చగలిగేలా ఉండాలి. గ్రామాల్లో చెరువుల పూడికతీత, భవనాల నిర్మాణం, కాలువల నిర్మాణం, మొక్కల పెంపకం, కోతుల నిర్మూలన వంటి పనులన్నీ ఇందులోకి తీసుకుని రాగలిగితే మంచిది. ఇకపోతే వ్యవసాయంలో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ కొత్త ఉపాధి పథకంలో అయినా ఈ సమస్యకు పరిష్కారం చూపగలగాలి. ఎల్‌నినో ప్రభావంతో ఈ యేడు వర్షాలు అంతంతమాత్రంగానే ఉండనున్నాయి.

ఈసారి అనేక ప్రాంతాల్లో నైరుతి వర్షించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై తీవ్ర ప్రభావం ఉండబోతోంది. దీంతో దేశవ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటివనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్యమవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇలాంటి సందర్భాల్లో ఉపాధి పనులతో సమస్యలను ఎదుర్కొనేందుకు ఎదురీదాలి. గ్రామాల్లో నీటి వనరులను పెంచే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. మొక్కలను పెంచాలి. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధితో ముడిపడి ఉండటంతో విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనికి విరుగుడుగా ప్రధానంగా భూగర్భ జాలాలను పెంచుకోవాలి. వాననీటిని ఒడిసిపట్టాలి. ఈ పనులకు అవసరమయ్యే కూలీలను ఉపాధి పథకం ద్వారా భర్తీ చేయగలగాలి. అప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మార్గం చూపినవారం అవుతాం.



## శెహభాష్ లోకేశ్.. విద్యా సంస్కరణలు భేష్

### మంత్రి పనితీరుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు

అనంతపురం, జూలై 01: సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌పై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు కురిపించారు. స్నాతకోత్సవంలో పట్టభద్రులను ఉద్దేశించి లోకేశ్ చేసిన ప్రసంగం యువతలో నూతన స్ఫూర్తిని రగిల్చేలా సాగిందని కొనియాడారు. కార్యక్రమం అనంతరం హెలికాప్టర్ వద్దకు వీడ్కోలు పలికేందుకు వచ్చిన లోకేశ్‌ను ప్రత్యేకంగా పిలిచి అభినందించిన రాష్ట్రపతి.. ఏపీలో విద్యార్థి కేంద్రంగా అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు అద్భుతంగా ఉన్నాయని, రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపేలా భవిష్యత్తులోనూ ఈ మార్పులను ఇలాగే కొనసాగించాలని సూచించారు. ఈ ప్రతిష్టాత్మక వేడుకలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు గవర్నర్ అబ్దుల్ నజీర్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

అంతకుముందు స్నాతకోత్సవ సభలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దార్శనికతతో కూడిన 'వికసిత్ భారత్ 2047' స్ఫూర్తితో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్యం దిశగా రాష్ట్రాన్ని ఇన్నోవేషన్, టెక్నాలజీ, మ్యానుఫ్యాక్చరింగ్ గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. ఎన్నో వ్యక్తిగత విషాదాలు, సవాళ్లను ఎదుర్కొని దేశ అత్యున్నత పీఠాన్ని అధిరోహించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవిత ప్రయాణం తరగతి గదుల్లో నేర్చుకోలేని ఒక గొప్ప పాఠమని, యువతకు నిరంతర ఆదర్శమని కొనియాడారు. మారుతున్న ప్రపంచంలో యువత కేవలం ఉద్యోగాలు వెతికే స్థాయిలోనే ఆగిపోకుండా, సరికొత్త ఆవిష్కరణలతో ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని, వైఫల్యాలను తట్టుకుని నిలబడే ధైర్యంతో దేశం గర్వపడేలా గొప్ప వారసత్వాన్ని సృష్టించాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు.

## అయోధ్య విరాళాల చోరీ కేసులో సంచలన నిజాలు

**వాష్‌రూమ్‌లలో నగదు దాచి.. సీసీటీవీలకు చిక్కకుండా తరలింపు!**

**ఇంటిదొంగల లీలలపై ముమ్మర దర్యాప్తు..**

**నిందితుడు అవినాష్ శుక్లా విచారణలో కీలక వివరాలు లభ్యం**

**మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రా పేరు ప్రస్తావన**

అయోధ్య, జులై 01: దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన అయోధ్య రామాలయ విరాళాల అపహరణ కేసు దర్యాప్తులో రోజుకో విస్తుపోయే నిజం వెలుగులోకి వస్తోంది. ఆలయంలోని విరాళాల లెక్కింపు వ్యవస్థలో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకున్న 'ఇంటిదొంగలు' ఎంతో సునాయాసంగా భారీ మొత్తంలో సొమ్మును బయటకు తరలించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేయగా, కోర్టు అనుమతితో వారిలో ఒకడైన అవినాష్ శుక్లాను పోలీసులు మంగళవారం రెండు గంటల పాటు సుదీర్ఘంగా విచారించారు. విరాళాల కౌంటింగ్ గది తాళాలను మరో నిందితుడు టిన్నూ యాదవ్ సంపాదించాడని, ఎవరూ లేని సమయం చూసి తాము అక్కడ చోరీకి పాల్పడేవాళ్లమని శుక్లా అంగీకరించాడు. ఆలయ ప్రాంగణంలోని సీసీటీవీ కెమెరాల స్థానాలు, వాటి పర్యవేక్షణ వ్యవస్థపై పూర్తి అవగాహన ఉన్న ఈ ముఠా.. కెమెరాలకు చిక్కకుండా ఉండేందుకు చోరీ చేసిన సొమ్మును తొలుత వాష్‌రూమ్‌లలో దాచిపెట్టి, ఆ తర్వాత అనుకూలమైన సమయంలో బయటకు చేరవేసేవారని దర్యాప్తులో స్పష్టమైంది. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్వాహకులతో తమకున్న సాన్నిహిత్యం కారణంగానే తమను ఎవరూ అనుమానించలేకపోయారని నిందితుడు వెల్లడించడం గమనార్హం. ఈ అక్రమ చోరీ సొమ్ముతో తాను సొంతంగా ఇల్లు, విలువైన స్థలాన్ని కొనుగోలు చేసినట్లు నిందితుడు అవినాష్ శుక్లా పోలీసుల ఎదుట అంగీకరించాడు. దీంతో నిందితుడి ఆర్థిక లావాదేవీలతో పాటు, ఈ కుంభకోణంలో భాగస్వాములైన ఇతర నిందితుల ఆస్తుల వివరాలపైనా పోలీసులు ప్రస్తుతం సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ఎవరికీ కనీస అనుమానం రాకుండా నిందితులు ఇంత సుదీర్ఘకాలం పాటు ఈ దొంగతనాలను ఎలా కొనసాగించగలిగారు, వీరి వెనుక ఇంకా ఎంతమంది హస్తం ఉందనే కోణంలో పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. ముఖ్యంగా విచారణ సమయంలో నిందితులు పలుమార్లు ట్రస్టీ అనిల్ మిశ్రా పేరును ప్రస్తావించినట్లు పోలీసు వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ఈ భారీ విరాళాల చోరీ వ్యవహారం వెలుగులోకి వచ్చిన వెంటనే ఆయన తన ట్రస్ట్ సభ్యత్వానికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే; ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంలో ఆయన పాత్రపై కూడా పోలీసులు నిశితంగా దృష్టి సారించారు.


## యూకేలో చదవాలంటే ఎంత ఖర్చవుతుంది? నిజాలు ఇవే...

విదేశీ విద్య అనగానే చాలా మంది విద్యార్థులు, తల్లిదండ్రుల మనసులో ముందుగా వచ్చే ప్రశ్న... "యూకేలో చదవాలంటే ఎంత ఖర్చవుతుంది?" చాలా మంది కోట్ల రూపాయలు అవసరమని భావించి తమ కలలను మధ్యలోనే వదిలేస్తుంటారు. కానీ వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి.

ప్రస్తుతం యూకేలో బ్యాచిలర్స్, మాస్టర్స్ చదవడానికి అనేక విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నాయి. విద్యార్థి విద్యార్హతలు, మార్కులు, ఎంపిక చేసిన యూనివర్సిటీ ఆధారంగా ట్యూషన్ ఫీజులో తగ్గింపు లభించే అవకాశాలు ఉన్నాయి.

యూకేలో కోర్సు, యూనివర్సిటీ, నగరాన్ని బట్టి ట్యూషన్ ఫీజు మారుతూ ఉంటుంది. అలాగే నివాసం, ఆహారం, ప్రయాణం వంటి జీవన వ్యయాలు కూడా విద్యార్థి ఎంచుకునే ప్రాంతాన్ని బట్టి మారుతాయి. లండన్ వంటి నగరాల్లో ఖర్చు కొంత ఎక్కువగా ఉండగా, ఇతర నగరాల్లో తక్కువ వ్యయంతో చదువు పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయి.

మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ని యూకే ప్రభుత్వం నిబంధనల ప్రకారం విద్యార్థులు చదువుతో పాటు నిర్ణీత గంటల పాటు పార్ట్-టైమ్ ఉద్యోగాలు చేయవచ్చు. దీని ద్వారా రోజువారీ ఖర్చుల్లో కొంత భాగాన్ని విద్యార్థులు స్వయంగా భరించే అవకాశం ఉంటుంది. చదువు పూర్తైన తర్వాత **Graduate Route** ద్వారా ఉద్యోగ అవకాశాలను అన్వేషించే వెసులుబాటు కూడా ఉంది.

విదేశీ విద్య ఖర్చును తగ్గించుకోవాలంటే సరైన యూనివర్సిటీ ఎంపిక, అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్‌లు, విద్యా రుణాల ఎంపిక, ఆర్థిక ప్రణాళిక వంటి అంశాలపై ముందుగానే అవగాహన కలిగి ఉండటం అవసరం. నిపుణుల సలహాతో ముందుకు వెళితే అనవసర ఖర్చులను తగ్గించుకోవచ్చు.

విదేశీ విద్య కోసం సిద్ధమవుతున్న విద్యార్థులు కేవలం ఫీజులనే కాకుండా, కోర్సు నాణ్యత, యూనివర్సిటీ గుర్తింపు, ఉద్యోగ అవకాశాలు, స్కాలర్‌షిప్‌లు, భవిష్యత్ కెరీర్ అవకాశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

యూకేలో ఉన్నత విద్యపై పూర్తి సమాచారం, సరైన యూనివర్సిటీ ఎంపిక, స్కాలర్‌షిప్ అవకాశాలు, అడ్మిషన్ ప్రక్రియ, డాక్యుమెంటేషన్ మరియు స్టూడెంట్ వీసా మార్గదర్శకత్వం కోసం **EXXEELLA Educational Group** విద్యార్థులకు సమగ్ర సేవలను అందిస్తోంది.



మరిన్ని వివరాలకు
EXXEELLA
Educational Group
**Bhanu Sairam Arepu**
Educational Counsellor
9100749422
applications@exxeella.com



# లెక్కల మాస్టారైన జిల్లా కలెక్టర్

## సర్కారు బడిలో తేజస్ నంద్ లాల్ పవార్ సందడి

హుజూర్నగర్ జూలై 2

చదువుతో పాటు క్రమశిక్షణపై విద్యార్థులకు దిశానిర్దేశం ఆయన జిల్లాకు బాస్.. నిత్యం ఫైళ్లు, సమీక్షలతో బిజీగా ఉంటారు. కానీ, ఒక్కసారిగా కలెక్టర్ తన హోదాను పక్కన పెట్టి లెక్కల మేస్టార్ అవతారమెత్తారు. చేతిలో చాక్ పీస్ పట్టుకుని బ్లాక్ బోర్డుపై లెక్కలు వేస్తూ విద్యార్థులకు పాఠాలు బోధించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ బుధవారం హుజూర్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. బ్లాక్ బోర్డు వద్దకు వెళ్లి-పాఠశాలకు చేరుకున్న కలెక్టర్ నేరుగా తరగతి గదిలోకి వెళ్లారు. అక్కడ విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. చదువు ఎలా సాగుతోంది? ఉపాధ్యాయులు సరిగ్గా వస్తున్నారా? అని ఆరా తీశారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు గణితంలో ఉన్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా బ్లాక్ బోర్డు దగ్గరకు వెళ్లి విద్యార్థులకు లెక్కలు బోధించారు. కష్టమైన సూత్రాలను సులభంగా ఎలా గుర్తుంచుకోవా లో వివరించారు. కలెక్టర్ స్వయంగా పాఠాలు చెబుతుంటే విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. అనుమానాలు నివృత్తి. కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా, విద్యార్థులు అడిగిన పలు సందేహాలను కలెక్టర్ ఓపిగ్గా నివృత్తి చేశారు. చదువుపై ఏకాగ్రత ఉంచాలి. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు అని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా బడికి రావాలని సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానోపాధ్యాయులతో చర్చించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి డివిజనల్ అధికారి శ్రీనివాసులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఘోర బస్సు ప్రమాదం

ఉన్నావ్, జూలై 1

ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో బుధవారం తెల్లవార ుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణిస్తున్న స్లీపర్ బస్సు ఎదురుగా వస్తున్న ఎర్టిగా కారును ఢీకొని, అనంతరం అదుపుతప్పి రైలింగ్‌ను బలంగా ఢీకొట్టి రోడ్డుకు బయట పడిపోయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉండటం తీవ్ర విషాదాన్ని నింపింది. బంగర్‌మావు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవ్‌ఖారి గ్రామం సమీపంలో ఉదయం సుమారు 4.30 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. హర్యానా నుంచి బీహార్‌కు వెళు _న్న స్లీపర్ బస్సు వేగంగా ప్రయాణిస్తుండగా ఎదురుగా వస్తున్న ఎర్టిగా కారును ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు బస్సు అదుపు తప్పి ఎక్స్‌ప్రెస్‌వే రక్షణ గోడను బలంగా ఢీకొని రోడ్డుకు బయటకు దూసుకెళ్లింది.

# ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ఏఐఐఈఏ నిరంతర పోరాటం

## 76వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ

సూర్యాపేట, జూలై 1



ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ రంగ బీమా సంస్థల పరిరక్షణ కోసం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (AIIEA) నిరంతరం పోరాటం చేస్తోందని సంఘం సూర్యాపేట శాఖ అధ్యక్షుడు ఎల్. మోహన్ సింగ్ పేర్కొన్నారు.

ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ రోడ్డులో ఉన్న ఎల్ఐసీ కార్యాలయం వద్ద యూనియన్ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ బీమా సంస్థలను బలోపేతం చేయడం, ఉద్యోగుల హక్కులను పరిరక్షించడం, సామాజిక భద్రత, పెన్షన్ సౌకర్యాలు, వేతన సవరణ వంటి అంశాల సాధన కోసం ఏఐఐఈఏ దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఉద్యోగుల హక్కులు ఎన్నో సంవత్సరాల పోరాటాల ఫలితంగానే సాధ్యమయ్యాయని, వాటిని కాపాడుకునేందుకు ఉద్యోగులంతా ఐక్యంగా ఉండి సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల ప్రయోజనాల విషయంలో యూనియన్ రాజీలేని వైఖరితో ముందుకు సాగుతుందని, హక్కుల సాధన కోసం అనేక మంది నాయకులు, కార్యకర్తలు చేసిన త్యాగాలను ఈ సందర్భంగా ఆయన స్మరించారు.

ఈ కార్యక్రమంలో ఏఐఐఈఏ సూర్యాపేట శాఖ కార్యదర్శి డి. ప్రభాకర్, నాయకులు కె. రామయ్య, బి. శంకర్, ఎం. సంజీవయ్య, జి. భిక్షం, వి. శివకుమార్, ఎం. రవీందర్, సందీప్, సువర్ణ, హరిశంకర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాధికార సమరభేరి సభ' కు కమలాపూర్ కూరగాయల మార్కెట్ మహిళ వ్యాపారస్తులకు ఆహ్వాన పత్రికల అందజేత

హనుమకొండ/కమలాపూర్ :



జూలై 5వతేదీన భువనగిరి పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'రాజ్యాధికార సభ'ను విజయవంతం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ హనుమకొండ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా కమలాపూర్ మండల కేంద్రంలోని స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మార్కెట్ ప్రాంతంలో ఉన్న మహిళా వ్యాపారులను, కొనుగోలుదారులను హనుమకొండ జిల్లా పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. భువనగిరి సభకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను వారికి అందజేసి, మహిళల హక్కుల సాధన కోసం, సమాజంలో రాజకీయ మార్పు కోసం జరగబోయే ఈ మహా సభకు మహిళలు అందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పూజారి సత్యనారాయణ, నాయకులు ముడిదే శ్రీనివాస్, హనుమకొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్ భద్రకాళి రమణ, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్, మరియు అనిల్ తదితరులు పాల్గొన్నారు.



**యాదాద్రి భువనగిరి జిల్లా... తుర్కపల్లి మండలం హలో బిసి ఛలో భువనగిరి రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభ ప్రచార కార్యక్రమం లో భాగంగా... వీరారెడ్డిపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు ఆహ్వాన పత్రిక అందచేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గోనే కృష్ణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పైసా మల్లిఖార్జున్ , కొండాపురం గ్రామ శాఖ అధ్యక్షుడు రాగుల రాజు పాల్గొన్నారు...**



**తెలంగాణ రాజ్యాధికార సమరభేరి ఆహ్వాన పత్రికను అమరుడు ముక్క కర్ణాకర్ కుమారునికి అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిని మీనా గౌడ్, గిరగాని బిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొనడం జరిగింది**



# పూడిక తీయగా బయటపడిన మృతదేహం

మేడ్చల్-మల్కాజిగిరి, జూలై 1

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పూడిక తొలగింపు పనుల స ందర్భంగా గుర్తుతెలియని మృతదేహం బయటపడటం కల కలం రేపింది. అల్వాల్ మండలం మచ్చబొల్లారంలోని మోతు కుల కుంట ఔట్‌లెట్ నాలాలో హైడ్రా, విపత్తు స్పందన బృం దాలు సంయుక్తంగా పూడిక తొలగింపు పనులు చేపడుతు ండగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మృతదేహం బయట పడటంతో అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అం దించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలాల్లో పేరుకు పోయిన చెత్త, పూడికను భారీ యంత్రాలతో తొలగిస్తున్న సమ యంలో ఈ మృతదేహం చెత్తతో కలిసి బయటకు వచ్చింది. సాధారణంగా పరుపులు, దిండ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడుతుండగా, ఈసారి మృతదేహం కనిపించడంతో అక్కడ ఉన్న అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే పనులను నిలిపివేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు.




# వైద్యులకు ఈటల వందనం

## డాక్టర్స్ డే సందర్భంగా రీహాబిలిటేషన్ వార్డు ప్రారంభం

## వైద్యులను సన్మానించి సేవలను కొనియాడిన ఈటల రాజేందర్

హైదరాబాద్, జూలై 1

రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురంలో డాక్టర్స్ డే సందర్భంగా లక్ష్మీ హెల్త్ కేర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రీహాబిలిటేషన్ వార్డును బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన డాక్టర్స్ డే వేడుకల్లో పాల్గొని వైద్యులను సన్మానించారు. పలువురు వైద్యులకు అవార్డులు అందజేసి వారి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ వైద్యులను భగవంతునితో పోలుస్తారని, "వైద్యో నారాయణో హరిః" అనే మాట వారి సేవలకు నిదర్శనమని అన్నారు. తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు నిరంతరం కృషి చేస్తారని కొనియాడారు. ఎంత మంది రోగులు వచ్చినా ఓర్పుతో సేవలందించడం వైద్య వృత్తి గొప్పతనమని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో వైద్యులు, వైద్య సిబ్బంది ఎదుర్కొన్న సవాళ్లను ఈటల రాజేందర్ గుర్తుచేశారు. ఆ సమయంలో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నప్పటికీ వైద్యులు వెనుకడుగు వేయకుండా సేవలందించారని అన్నారు.

# మత్స్యశాఖలో ఉద్యోగాల హామీ

హైదరాబాద్, జూలై 1

మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి బీఎఫ్ఎస్సీ విద్యార్థులతో బుధవారం సమావేశమై వారి సమస్యలు, భవిష్యత్ ఉపాధి అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని హామీ ఇచ్చారు. విద్యార్థుల అర్హతలను వినియోగించేలా శాఖలో తగిన అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. రాష్ట్రంలో చేప పిల్లల ఉ త్పత్తిని గణనీయంగా పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఎఫ్ఎస్సీ పట్టభద్రుల సేవలను వినియోగిం చనున్నట్లు చెప్పారు. మత్స్య రంగంలో శాస్త్రీయ విధానాలను మరింత విస్తరించేందుకు యువ నిపుణులకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో చేపల కూర అందించే కార్యక్రమంలో కూడా బీఎఫ్ఎస్సీ విద్యార్థుల సేవలను వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు మత్స్య రంగానికి కూడా ప్రోత్సాహం లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోం దన్నారు. ఈ కార్యక్రమం ద్వారా చేపల వినియోగం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.




# సింగరేణి అధికారుల ఆందోళనకు బీఆర్ఎస్ మద్దతు

మంచిర్యాల, జూలై 1



సింగరేణి కోల్ మైన్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీఆర్‌పీ, పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసన సభ ఉపపక్ష నేత హరీశ్ రావు పాల్గొని ఆందోళన చేస్తున్న అధికారులతో సంఘీభావం తెలిపా రు. అధికారుల న్యాయబద్ధమైన డిమాండ్ల పరిష్కారానికి పార్టీ అండగా ఉ ంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, సింగరేణి చరిత్రలో కార్మికులు సమ్మెలు చేయడం సాధారణమే అయినప్ప టికీ, ఇప్పుడు అధికారులు కూడా నిరాహార దీక్షలు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శిం చారు. అధి కారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాం డ్ చేశారు. బీ ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడా ది పనితీరు ఆధారిత ప్రోత్సాహక వేతనం క్రమం తప్పకు ండా చెల్లించామని హరీశ్ రావు పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం గత రెండేళ్లుగా ఆ ప్రోత్సాహకాన్ని నిలిపివేయ డంతో అధికారులు తీవ్ర అసంతృ ప్తికి గురయ్యారని అన్నారు. దీనివల్ల ఉ ద్యోగుల్లో ఉత్సాహం తగ్గి బొగ్గు ఉత్పత్తిపై కూడా ప్రభావం పడిం దని ఆయన ఆరోపించారు.

# ఆడబిడ్డ జెండా ఎత్తింది.. రాష్ట్ర అజెండా మారాల్సిందే

## సీతాఫల్‌మండిలో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ

## ప్రభుత్వ హామీల అమలుపై కాంగ్రెస్‌పై విమర్శలు

హైదరాబాద్, జూలై 1

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా పండుగ సందర్భంగా సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండిలో పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ జెండాను ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో రాజకీయ అజెండా మారాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలనే సంకల్పంతోనే తాను పార్టీని స్థాపించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలంగాణ ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా పేదలు, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదని కవిత విమర్శించారు. విద్య, వైద్యం ఇప్పటికీ సాధారణ కుటుంబాల కు భారంగా మారాయని అన్నారు. అందుకే టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే పేదల జేబు నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకుండా ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో



ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫల మైందని కవిత ఆరోపించారు. ఆరు హామీల్లో ఒక్కదాన్ని కూడా పూర్తిగా అమలు చేయకుండా మళ్లీ ప్రజల మద్దతు కోరడం సమంజసం కాదన్నారు. పెన్షన్ల పెంపు, కొత్త ఇళ్ల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మూసీ ప్రాజెక్టు, మెట్రో వంటి భారీ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తు న్న ప్రభుత్వం పేదల అవసరాలను విస్మరిస్తోందని కవిత అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం నిధులు లేవని చెబుతూ, భారీ వ్యయంతో ప్రాజెక్టులు చేపట్టడం సరైన విధానం కాదన్నారు. ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగా లు, స్వయం ఉపాధికి పెద్దపీట వేస్తామని కవిత తెలిపారు. డిగ్రీలు పూర్తి చేసిన యువతకు ఉద్యోగాలు రాకపోతే స్వయం ఉపాధి కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. విద్య, వైద్యం, ఉపాధి అంశాలనే తమ పార్టీ ప్రధాన అజెండాగా తీసుకెళ్తామని చెప్పారు.

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోలేదని కవిత ఆరోపించారు. ఉద్యమకారులకు భూములు ఇస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. ప్రజల సమస్యల పరిష్కారమే పార్టీ లక్ష్యమని, ప్రజల కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకే పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే టీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకువచ్చి సంక్షేమ పాలన అందిస్తామని ఆమె తెలిపారు.

# పసిడి ధరలు తగ్గుముఖం..

**పసిడి డిమాండ్ దాదాపు 70 శాతం తగ్గినట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్న నేపథ్యంలో బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. పాత బంగారు నగలను విక్రయించేందుకు వినియోగదారులు ఎక్కువగా ముందుకు వస్తుండటంతో మార్కెట్‌లో డిమాండ్ తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు.**



**హైదరాబాద్ -- జూలై 01, 2026**

బుధవారం ఉదయం 11 గంటల సమయానికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,780గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,29,050గా ఉంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,05,590గా కొనసాగుతోంది.తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం నగరాల్లో ఒకే ధరలు నమోదయ్యాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి.దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో బంగారం ధర అత్యధికంగా నమోదైంది. అక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,910గా ఉండగా, న్యూఢిల్లీలో రూ.1,40,930, అహ్మదాబాద్‌లో రూ.1,40,830, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళలో రూ.1,40,780గా నమోదైంది.

మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ ధరల మార్పులు, వినియోగదారుల కొనుగోలు ధోరణులను బట్టి రానున్న రోజుల్లో బంగారం ధరల్లో మరింత హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




# లేఆఫ్ భయం కంటే అనిశ్చితే పెద్ద ఒత్తిడి..

## వైరల్‌గా మారిన మైక్రోసాఫ్ట్ ఉద్యోగి పోస్టు

**మైక్రోసాఫ్ట్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సోషల్ మీడియాలో చేసిన భావోద్వేగ పోస్టు వైరల్‌గా మారింది. త్వరలో కంపెనీ చేపట్టనున్న ఉద్యోగుల కోతలో తన పేరు కూడా ఉండొచ్చని భావిస్తున్న ఆయన, ఉద్యోగం కోల్పోవడం కంటే ఆ అనిశ్చితి నుంచి బయటపడుతున్నాననే భావనే తనకు ఎక్కువ ఉపశమనం కలిగిస్తోందని పేర్కొన్నారు.**

**సియాటిల్ -- జూలై 1 2026**

తన మేనేజర్‌కు లేఆఫ్ జాబితా అందబోతుందని, అందులో తన పేరు కూడా ఉండొచ్చని ముందే అర్థమైందని ఉద్యోగి వెల్లడించాడు. గత కొంతకాలంగా కీలక ప్రాజెక్టుల నుంచి తనను తప్పించడం, మేనేజర్ స్పందన తగ్గిపోవడం, కార్యాలయంలో చోటుచేసుకున్న మార్పులను గమనించి పరిస్థితిని ముందుగానే ఊహించానని తెలిపాడు."ఉద్యోగం పోవడం సంతోషించాల్సిన విషయం కాదు. ప్రస్తుతం ఉద్యోగ మార్కెట్ కూడా అంత అనుకూలంగా లేదు. అయినప్పటికీ నెలల తరబడి వెంటాడుతున్న అనిశ్చితి ముగియబోతుందనే భావన నాకు ఉపశమనాన్ని ఇస్తోంది. ప్రతి త్రైమాసికం 'తర్వాతి వంతు నాదేనా' అనే భయంతో జీవించడం ఉద్యోగం కోల్పోవడం కంటే ఎక్కువ మానసిక ఒత్తిడికి గురిచేసింది" అని పోస్టులో పేర్కొన్నాడు.ఇంకా, ఒక దశ తర్వాత ఉద్యోగం పోతుందనే భయం తగ్గిపోతుందని, కానీ నిరంతర అనిశ్చితిలో పనిచేయడం వ్యక్తిగత జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తన అనుభవాన్ని పంచుకున్నాడు.ఈ పోస్టు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీసింది. పలువురు ఉద్యోగులు కూడా తమకు ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయని, ఉద్యోగం కోల్పోయిన తర్వాతే మానసికంగా ప్రశాంతత లభించిందని వ్యాఖ్యానించారు. ఐటీ రంగంలో ఉద్యోగ భద్రత, కార్యాలయ ఒత్తిడిపై ఈ పోస్టు మరోసారి చర్చను తెరపైకి తీసుకొచ్చింది.

# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గింపు.. లీటర్‌పై రూ.5, రూ.3 కోత

**ముంబై -- జూలై 1 2026**

దేశంలో ఇంధన ధరల్లో స్వల్ప ఊరట లభించింది. నయారా ఎనర్జీ దేశవ్యాప్తంగా తన రిటైల్ ఇంధన కేంద్రాల్లో పెట్రోల్ ధరను లీటర్‌కు రూ.5, డీజిల్ ధరను లీటర్‌కు రూ.3 చొప్పున తగ్గించింది. ఈ కొత్త ధరలు ఇప్పటికే 7,000కు పైగా నయారా రిటైల్ ఔట్‌లెట్లలో అమల్లోకి వచ్చాయి. గత రెండేళ్లలో ఒక ఇంధన రిటైల్ సంస్థ ధరలను తగ్గించడం ఇదే తొలిసారి.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడం, కీలక సముద్ర మార్గాలు తిరిగి తెరుచుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే నయారా ఎనర్జీ ధరల తగ్గింపు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్రాల వారీగా వ్యాట్ తదితర స్థానిక పన్నులు భిన్నంగా ఉండటంతో తుది రిటైల్ ధరల్లో స్వల్ప తేడాలు ఉండనున్నాయి.నయారా ధరలు తగ్గించినప్పటికీ, ప్రభుత్వరంగ చమురు సంస్థలు మాత్రం తమ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. దేశ ఇంధన మార్కెట్‌లో అధిక భాగస్వామ్యం కలిగిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థలు పాత ధరలనే కొనసాగిస్తున్నాయి.

ప్రస్తుతం ఢిల్లీలో ఇండియన్ ఆయిల్ బంకుల్లో పెట్రోల్ లీటర్ ధర రూ.102.12, డీజిల్ ధర రూ.95.20గా కొనసాగుతోంది. కాగా, ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో మార్చి 26న నయారా పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచింది. తాజా తగ్గింపుతో ఆ పెంపును పూర్తిగా వెనక్కి తీసుకుంది.మరోవైపు, ప్రభుత్వరంగ చమురు సంస్థలు మే నెల ద్వితీయార్థంలో పలు దఫాలుగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ.7.50 చొప్పున పెంచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం నయారా తీసుకున్న నిర్ణయం తర్వాత ఇతర సంస్థలు కూడా ధరలను సమీక్షిస్తాయా అనే అంశంపై వినియోగదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.






# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..

**ముంబై -- జూలై 1, 2026**

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. ఎఫ్‌ఎంసీజీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, రియల్టీ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్లు నమోదవడంతో ప్రధాన సూచీలు పైకి ఎగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి నిఫ్టీ 140.10 పాయింట్లు లేదా 0.59 శాతం లాభపడి 24,005.85 వద్ద స్థిరపడగా, సెన్సెక్స్ 443.97 పాయింట్లు లేదా 0.58 శాతం పెరిగి 76,922.64 వద్ద ముగిసింది.మార్కెట్ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, నిఫ్టీకి 24,100 నుంచి 24,200 స్థాయిలు కీలక నిరోధక ప్రాంతంగా ఉన్నాయి. ఈ స్థాయిని అధిగమిస్తే సూచీ 24,400 మార్కు దిశగా పయనించే అవకాశముందని పేర్కొన్నారు. మరోవైపు 23,900 నుంచి 23,800 స్థాయిలు బలమైన మద్దతు ప్రాంతాలుగా ఉండనున్నాయని తెలిపారు.నిఫ్టీలో ఎటర్నల్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, నెస్లే ఇండియా షేర్లు అత్యధిక లాభాలు నమోదు చేసి మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. బ్రాడర్ మార్కెట్ కూడా సానుకూలంగా ముగియగా, నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.34 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.36 శాతం మేర పెరిగాయి.

# శాంసంగ్ కొత్త 5జీ ఫోన్ విడుదల..

## జూలై 3 నుంచి విక్రయాలు

**శాంసంగ్ భారత మార్కెట్లో తన కొత్త మిడ్‌రేంజ్ స్మార్ట్‌ఫోన్ 'గెలాక్సీ ఏ27 5జీ'ను అధికారికంగా విడుదల చేసింది. ఆధునిక ఫీచర్లు, ఆకర్షణీయమైన డిజైన్, దీర్ఘకాలిక సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లతో ఈ ఫోన్‌ను తీసుకొచ్చింది. జూలై 3 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. గత మోడల్‌తో పోలిస్తే మెరుగైన పనితీరు, కొత్త కృత్రిమ మేధస్సు ఆధారిత ఫీచర్లను ఇందులో అందించారు.**




**న్యూఢిల్లీ ,జూలై 1, 2026**

6 జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజ్ కలిగిన ప్రాథమిక మోడల్ ధరను రూ.28,999గా నిర్ణయించారు. ప్రారంభ ఆఫర్‌లో భాగంగా బ్యాంక్ లేదా యూపీఐ ద్వారా కొనుగోలు చేస్తే రూ.3,000 వరకు తక్షణ రాయితీ లభిస్తుంది. ఈ ఫోన్ 8 జీబీ ర్యామ్‌తో 128 జీబీ, 256 జీబీ స్టోరేజ్ వేరియంట్లలో కూడా అందుబాటులోకి రానుంది. లైట్ గ్రీన్, లైట్ పింక్, బ్లాక్ రంగుల్లో విక్రయించనున్నారు. అధికారిక వెబ్‌సైట్, రిటైల్ స్టోర్లు, ఈ-కామర్స్ వేదికల ద్వారా కొనుగోలు చేయవచ్చు. 15 నెలల వడ్డీలేని ఈఎంఐతో పాటు 24 నెలల వరకు ఇతర ఈఎంఐ సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఈ ఫోన్‌లో 6.7 అంగుళాల పూర్తి హెచ్‌డీ ప్లస్ సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, గొరిల్లా గ్లాస్ విక్టస్ ప్లస్ రక్షణను అందించారు. నాలుగు నానోమీటర్ల సాంకేతికతతో రూపొందించిన స్నాప్‌డ్రాగన్ 6 జెన్ 3 ప్రాసెసర్, ఎల్పీడీడీఆర్5ఎక్స్ ర్యామ్, యూఎఫ్‌ఎస్ 3.1 స్టోరేజ్‌తో వేగవంతమైన పనితీరు లభిస్తుంది.

# టీ20ల్లో ఇషాన్ నంబర్ వన్..

## టెస్టుల్లో హెడ్ అగ్రస్థానం

**దుబాయ్, జూలై 1, 2026**

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విడుదల చేసిన తాజా ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. భారత వికెట్‌కీపర్–బ్యాటర్ ఇషాన్ కిషన్ టీ20ల్లో ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్‌గా అవతరించగా, టెస్టుల్లో ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్ తొలిసారి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. టెస్ట్ బౌలింగ్‌లో భారత పేసర్ జస్ప్రీత్ బూమ్రా తన నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు.

టీ20 ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన చేసిన ఇషాన్ కిషన్ కెరీర్‌లోనే అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు సాధించి అగ్రస్థానానికి చేరుకున్నాడు. టోర్నీలో 200కు చేరువైన స్ట్రైక్‌రేట్‌తో 317 పరుగులు చేసిన ఇషాన్, అభిషేక్ శర్మను వెనక్కి నెట్టి నంబర్ వన్‌గా నిలిచాడు. ప్రస్తుతం వీరిద్దరి మధ్య కేవలం ఏడు రేటింగ్ పాయింట్ల తేడా మాత్రమే ఉంది. ఈ ఘనతతో టీ20ల్లో నంబర్ వన్ ర్యాంకు సాధించిన నాలుగో భారత బ్యాటర్‌గా ఇషాన్ రికార్డు సృష్టించాడు.

టీ20 ర్యాంకింగ్స్‌లో ఐర్లాండ్ కెప్టెన్ లోర్కాన్ టక్కర్, రాస్ అడైర్ తమ స్థానాలను మెరుగుపరుచుకోగా, బౌలింగ్ విభాగంలో మాథ్యూ హంఫ్రీస్ 25వ స్థానానికి చేరుకున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో భారత ఆటగాడు శివమ్ దూబే ఏడో స్థానంలో నిలిచాడు.

టెస్ట్ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ట్రావిస్ హెడ్ తొలిసారి ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్‌గా అవతరించాడు. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో హ్యారీ బ్రూక్, జో రూట్ ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో హెడ్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. బ్రూక్ రెండో స్థానానికి, రూట్ మూడో స్థానానికి పడిపోయారు.

టెస్ట్ బౌలింగ్‌లో జస్ప్రీత్ బూమ్రా మరోసారి నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకోగా, న్యూజిలాండ్ బౌలర్ మాట్ హెన్రీ రెండో స్థానానికి పరిమితమయ్యాడు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రచిన్ రవీంద్ర, డారిల్ మిచెల్, డెవాన్ కాన్వే తమ స్థానాలను మెరుగుపరుచుకున్నారు.

అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ టెస్ట్ ఆల్‌రౌండర్ల జాబితాలో మూడో స్థానంతో తన కెరీర్‌ను ముగించాడు. శ్రీలంకపై రాణించిన వెస్టిండీస్ పేసర్లు షమర్ జోసెఫ్, కెమర్ రోచ్ కూడా తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నారు.





ఫిఫా ప్రపంచకప్ 2026లో సహ ఆతిథ్య దేశమైన మెక్సికో రౌండ్ ఆఫ్ 16లోకి ఘనంగా ప్రవేశించింది. రౌండ్ ఆఫ్ 32లో ఈక్వెడార్‌పై 2-0 గోల్స్ తేడాతో విజయం సాధించి నాకౌట్ దశలో నాలుగు దశాబ్దాల నిరీక్షణకు తెరదించింది.మ్యాచ్ తొలి అర్ధభాగంలోనే మెక్సికో రెండు గోల్స్ నమోదు చేసి ఆధిపత్యం చాటింది. 22వ నిమిషంలో జులియన్ క్వినోనిస్ తొలి గోల్ చేయగా, 31వ నిమిషంలో రౌల్ జిమెనెజ్ మరో గోల్ సాధించి జట్టుకు 2-0 ఆధిక్యం అందించాడు. అనంతరం ఈ ఆధిక్యాన్ని చివరి వరకు కాపాడుకున్న మెక్సికో సునాయాస విజయాన్ని నమోదు చేసింది.

**మెక్సికో సిటీ - జూలై 1, 2026 -**

1986 ప్రపంచకప్‌లో బల్గేరియాపై నాకౌట్ దశలో గెలిచిన తర్వాత తొలిసారి మెక్సికో ఈ దశలో విజయం సాధించింది. గత ఏడు ప్రపంచకప్‌లలో వ రుసగా నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓడిన మెక్సికోకు ఈ విజయం చారిత్రక ంగా నిలిచింది. ఈ టోర్నీలో జులియన్ క్వినోనిస్‌కు ఇది మూడో గోల్ కావడం విశేషం. స్వదేశీ అభిమానుల మద్దతుతో జోరుమీదున్న మెక్సికో ఇప్పుడు క్వార్టర్ ఫైనల్ బెర్త్ కోసం రౌండ్ ఆఫ్ 16లో మరో కీలక పోరుకు సిద్ధమవుతోంది.

# హార్దిక్ కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీల పోటీ..

### ట్రేడ్ రేసులో సీఎస్‌కే, కేకేఆర్ ముందంజ

**ముంబై, జూలై 1, 2026**

ఐపీఎల్ 2026 సీజన్‌లో నిరాశాజనక ప్రదర్శన తర్వాత ముంబై ఇండియన్స్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఫ్రాంచైజీని వీడేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో అతడిని దక్కించుకునేందుకు పలు ఐపీఎల్ ఫ్రాంచైజీల మధ్య ట్రేడ్ పోటీ నెలకొంది.సమాచారం ప్రకారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మినహా మిగిలిన పలు ఫ్రాంచైజీలు హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ ట్రేడ్ రేసులో ముందున్నట్లు తెలుస్తోంది.ఎంఎస్ ధోనీ



తర్వాత జట్టుకు అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ అవసరమని భావిస్తున్న చెన్నై సూపర్ కింగ్స్ హార్దిక్‌కు కీలక బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు కోల్‌కతా నైట్ రైడర్స్ హార్దిక్‌కు నేరుగా కెప్టెన్సీ బాధ్యతలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రాజస్థాన్ రాయల్స్ కూడా దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా అతడిని తమ జట్టులోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య అంతర్గత చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం. అయితే ఈ ట్రేడ్‌పై ఇప్పటివరకు ఏ ఫ్రాంచైజీ కూడా అధికారిక ప్రకటన చేయలేదు.

భారత టీ20 జట్టు కెప్టెన్‌గా తొలి సిరీస్‌లోనే ఓటమి ఎదురైన నేపథ్యంలో శ్రేయస్ అయ్యర్ స్పందించాడు. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో తమ జట్టు అన్ని విభాగాల్లోనూ వెనుకబడిందని అంగీకరించిన ఆయన, ఆ ఓటమి నుంచి విలువైన పాఠాలు నేర్చుకున్నామని వెల్లడించాడు.



# ఐర్లాండ్ సిరీస్ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్నాం

**చెస్టర్‌స్ట్రీట్ ,జూలై 1, 2026**

ఐర్లాండ్ జట్టు మైదానం పరిస్థితులను అద్భుతంగా అర్థం చేసుకుని తమకంటే మెరుగ్గా ఆడిందని అయ్యర్ ప్రశంసించాడు. మైదానం కొలతలు, వికెట్ స్వభావాన్ని అంచనా వేయడంలో టీమిండియా విఫలమైందని పేర్కొన్నాడు. అయితే ఆ సిరీస్‌ను వెనక్కి వదిలేసి, ఇంగ్లండ్ పర్యటనపై పూర్తిగా దృష్టి సారించినట్లు స్పష్టం చేశాడు. బెల్‌ఫాస్ట్‌లోని స్టార్‌మాంట్ మైదానం పరిస్థితులకు అలవాటు పడటంలో జట్టు ఇబ్బందులు ఎదుర్కొందని అయ్యర్ తెలిపాడు. అవుట్‌ఫీల్డ్ నెమ్మదిగా ఉండటం, మైదానం కొలతలు భిన్నంగా ఉండటంతో కెప్టెన్‌గా ఫీల్డింగ్ అమర్చడం కూడా సవాలుగా మారిందని చెప్పాడు. ఐపీఎల్‌లో ఆడే మైదానాలతో పోలిస్తే అక్కడి పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని వివరించాడు. ఇంగ్లండ్‌లో పరిస్థితులు వేరుగా ఉంటాయని, అక్కడి మైదానాలు స్టేడియం వాతావరణంలో ఉండటంతో మెరుగైన ప్రదర్శన చేయగలమనే నమ్మకం వ్యక్తం చేశాడు. ఐర్లాండ్ సిరీస్‌లో బ్యాటింగ్‌లో విఫలమైనప్పటికీ తన వ్యక్తిగత ఫామ్‌పై ఎలాంటి ఆందోళన లేదని స్పష్టం చేశాడు. నెట్స్‌లో తాను బంతిని అద్భుతంగా టైమ్ చేస్తున్నానని, ఒత్తిడి పరిస్థితుల్లో ఎలా ఆడాలో తనకు బాగా తెలుసని అయ్యర్ ధీమా వ్యక్తం చేశాడు. ఇంగ్లండ్ సిరీస్‌లో మెరుగైన ప్రదర్శనతో తిరిగి పుంజుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశాడు.


# శ్రీశాంత్‌పై నిషేధం ఎత్తివేత..

## కేరళ క్రికెట్ అసోసియేషన్ కీలక నిర్ణయం

టీమిండియా మాజీ ఫాస్ట్ బౌలర్ ఎస్. శ్రీశాంత్‌కు భారీ ఊరట లభించింది. అతనిపై విధించిన మూడేళ్ల నిషేధాన్ని కేరళ క్రికెట్ అసోసియేషన్ (కేసీఏ) ఎత్తివేసింది. గతంలో చేసిన వ్యాఖ్యలపై శ్రీశాంత్ బేషరతుగా క్షమాపణ చెప్పడంతో కేసీఏ ఈ నిర్ణయం తీసుకుంది. కేరళ క్రికెట్ అసోసియేషన్ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఈ అంశంపై చర్చించి ఏకగ్రీవంగా నిషేధాన్ని రద్దు చేశారు. గతేడాది కేసీఏ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా సోషల్ మీడియా, ఇతర వేదికల ద్వారా వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో శ్రీశాంత్‌పై మూడేళ్ల నిషేధం విధించారు. దీంతో కేసీఏ ఆధ్వర్యంలో జరిగే ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాన్ని ఆయన కోల్పోయారు. నిషేధాన్ని సవాలు చేస్తూ శ్రీశాంత్ కోర్టును ఆశ్రయించినప్పటికీ ఊరట లభించలేదు. ం

అనంతరం తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తూ కేసీఏకు బేషరతుగా క్షమాపణ లేఖ సమర్పించారు. ఆయన పశ్చాత్తాపాన్ని పరిగణనలోకి తీసుకున్న అసోసియేషన్ నిషేధాన్ని ఎత్తివేయాలని నిర్ణయించింది. అయితే భవిష్యత్తులో సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించినా లేదా బహిరంగ వ్యాఖ్యలు చేసినా కఠిన క్రమశిక్షణ చర్యలు తప్పవని కేసీఏ స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో కేరళ క్రికెట్ లీగ్ మూడో సీజన్‌లో ఏరీస్ కొల్లం సెయిలర్స్ జట్టుకు సహ యజమానిగా శ్రీశాంత్ కొనసాగేందుకు మార్గం సుగమమైంది. దీంతో ఆయన, కేసీఏ మధ్య కొనసాగిన వివాదానికి ముగింపు పలికినట్లైంది.





దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'వారణాసి' షూటింగ్ తుది దశకు చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆర్‌ఆర్‌ఆర్' ప్రత్యేక ప్రదర్శన సందర్భంగా రాజమౌళి చిత్ర పురోగతిపై ఆసక్తికర వివరాలు వెల్లడించారు. ప్రధాన యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ పూర్తయిందని, ఇంకా సుమారు 80 రోజుల టాకీ భాగం మాత్రమే మిగిలి ఉందని తెలిపారు.ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ నాటికి మొత్తం చిత్రీకరణ పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంకా చోప్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలనే లక్ష్యంతో చిత్రబృందం పనులు కొనసాగిస్తోంది.

హైదరాబాద్ -- జూలై 1, 2026 --

ఈ చిత్రం ఒక శివభక్తుడి జీవితాన్ని కేంద్రంగా చేసుకుని సాగే కాలయాన సాహసగాథగా రూపొందుతోంది. విశ్వంలోని అత్యంత శక్తివంతమైన ఒక అద్భుత వస్తువును అన్వేషించే ప్రయాణం కథకు ప్రధానాంశంగా ఉండనుంది. ఇందులో మహేష్ బాబు 'రుద్ర' పాత్రతో పాటు ప్రత్యేక ఘట్టంలో 'శ్రీరాముడు'గా కనిపించనున్నట్లు సమాచారం. ప్రియాంకా చోప్రా 'మందాకిని', పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' పాత్రల్లో నటిస్తున్నారు.ఈ సినిమా రెండు భాగాలుగా వస్తుందనే ప్రచారంపై కూడా రాజమౌళి స్పష్టత ఇచ్చారు. 'వారణాసి' ఒకే భాగంగా, సుమారు మూడు గంటల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. ప్రస్తుతం చిత్రబృందం మొత్తం దృష్టి ఈ ప్రాజెక్టుపైనే ఉండగా, నిర్ణయించిన విడుదల తేదీకి సినిమాను పూర్తి చేయడానికి శరవేగంగా పనులు కొనసాగుతున్నాయి.



# అమెరికాలో 'మా ఇంటి బంగారం' జోరు

**నటి సమంత ప్రధాన పాత్రలో నటించి, నిర్మించిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. కొంత విరామం తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన సమంత ఈ సినిమాతో మరోసారి తన మార్కెట్‌ను చాటుకున్నారని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.**

హైదరాబాద్, జూలై 1, 2026,

తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశీ మార్కెట్లలోనూ ఈ చిత్రానికి మంచి ఆదరణ లభిస్తోంది.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, అమెరికాలో రెండో మంగళవారం ఒక్కరోజులోనే ఈ చిత్రం 70 వేల డాలర్లకు పైగా వసూళ్లు సాధించినట్లు తెలుస్తోంది. దీంతో 2026లో విడుదలైన తెలుగు చిత్రాల్లో రెండో మంగళవారం అత్యధిక వసూళ్లు నమోదు చేసిన సినిమాగా నిలిచిందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఈ వసూళ్లపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.అమెరికా మార్కెట్‌లో ఇదే జోరు కొనసాగితే త్వరలోనే రెండు మిలియన్ డాలర్ల వసూళ్ల మార్కును చేరుకునే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మహిళా ప్రధాన పాత్రతో రూపొందిన చిత్రం ఈ స్థాయిలో ఆదరణ పొందడం విశేషంగా భావిస్తున్నారు.దర్శకురాలు నందిని రెడ్డి రూపొందించిన ఈ చిత్రంలో కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. సమంత నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు కూడా లభిస్తున్నాయి. నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా ఈ సినిమాతో సమంత విజయాన్ని అందుకున్నారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం దేశీయ, విదేశీ మార్కెట్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'మా ఇంటి బంగారం' ఈ ఏడాది విజయవంతమైన తెలుగు చిత్రాల్లో ఒకటిగా నిలిచే దిశగా దూసుకెళ్తోంది.

# 'జాంబీ రెడ్డి 2'లో షనాయా కపూర్?..

## అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు




యువ హీరో తేజ సజ్జ నటించనున్న 'జాంబీ రెడ్డి 2' సినిమాపై సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో కథానాయికగా బాలీవుడ్ యువ నటి షనాయా కపూర్ నటించే అవకాశాలు ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.

హైదరాబాద్ -- జులై 01, 2026 --

సినీ వర్గాల సమాచారం ప్రకారం, హీరోయిన్ పాత్ర కోసం షనాయా కపూర్‌తో చిత్రబృందం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అన్ని అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాతోనే ఆమె తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టనుంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం లేదా షనాయా కపూర్ తరఫున ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.2021లో విడుదలైన 'జాంబీ రెడ్డి' హారర్, కామెడీ, యాక్షన్ అంశాల మేళవింపుతో ప్రేక్షకులను ఆకట్టుకుని మంచి విజయాన్ని అందుకుంది. దీంతో సీక్వెల్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో రూపొందించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.మొదటి భాగానికి దర్శకత్వం వహించిన ప్రశాంత్ వర్మ ఈ సీక్వెల్‌కు కథను అందించినట్లు తెలుస్తోంది. అయితే రెండో భాగానికి ఆయన దర్శకత్వం వహించరని, మరో దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దీనిపై కూడా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.ప్రస్తుతం హీరోయిన్ ఎంపికతో పాటు నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'టాక్సిక్'లో పవర్‌ఫుల్ మహిళా పాత్రలు

హైదరాబాద్ -- జూలై 1, 2026 --

కన్నడ స్టార్ యష్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' నుంచి విడుదలైన తాజా గ్లింప్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న ఈ పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో మహిళా పాత్రలను ప్రత్యేకంగా పరిచయం చేస్తూ విడుదల చేసిన ఈ వీడియో ఆకట్టుకుంటోంది.గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో రూపొందిన ఈ గ్లింప్స్‌లో నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ పాత్రలను శక్తివంతంగా చూపించారు. ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు విజువల్స్ సూచిస్తున్నాయి. నేపథ్య సంగీతం, ఛాయాగ్రహణం, యాక్షన్ శైలి ఈ గ్లింప్స్‌కు మరింత బలం చేకూర్చాయి.ఇప్పటికే యష్ పాత్రకు సంబంధించిన ప్రచార చిత్రాలు అభిమానులను ఆకట్టుకోగా, తాజాగా మహిళా పాత్రల పరిచయంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. గ్యాంగ్‌స్టర్ ప్రపంచంలో జరిగే సంఘటనలతో ఈ కథ సాగేలా చిత్ర బృందం రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకాలపై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఆగస్టు 26, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




బాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా గుర్తింపు పొందిన కత్రినా కైఫ్ తన ప్రతిభతో సినీ పరిశ్రమలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. చదువు కంటే నటనపై ఆసక్తి పెంచుకున్న ఆమె, కష్టపడి స్టార్ హీరోయిన్‌గా ఎదిగి కోట్లాది మంది అభిమానులను సంపాదించారు. ప్రస్తుతం అత్యధిక పారితోషికం అందుకునే నటీమణుల్లో ఆమె ఒకరిగా నిలిచారు.

# కత్రినా కైఫ్ సినీ ప్రస్థానం



హైదరాబాద్ - జూలై 1, 2026 --

తెలుగు ప్రేక్షకులకు కూడా కత్రినా కైఫ్ సుపరిచితమే. వెంకటేష్ కథానాయకుడిగా నటించిన 'మల్లీశ్వరి' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమె తొలి చిత్రంతోనే మంచి విజయాన్ని అందుకున్నారు. అనంతరం బాలకృష్ణ సరసన 'అల్లరి పిడుగు' చిత్రంలో నటించారు. అయితే ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోకపోవడంతో తిరిగి బాలీవుడ్‌పై దృష్టి సారించారు.హిందీ చిత్రసీమలో వరుస విజయాలతో అగ్ర కథానాయికగా ఎదిగిన కత్రినా, ప్రముఖ హీరో విక్కీ కౌశల్‌ను వివాహం చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించారు. వివాహం అనంతరం కూడా ఎంపిక చేసిన చిత్రాల్లో నటిస్తూ సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను పదో తరగతి పూర్తి చేయలేదని కత్రినా వెల్లడించారు. అయినప్పటికీ తన ప్రతిభతో ఒక్కో చిత్రానికి సుమారు రూ.25 కోట్ల వరకు పారితోషికం అందుకునే స్థాయికి చేరుకున్నారు. ఆమె ఆస్తుల విలువ రూ.200 కోట్లకు పైగానే ఉంటుందని సినీ వర్గాల అంచనా. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ చురుకుగా ఉంటూ అభిమానులతో నిరంతరం మమేకమవుతున్నారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467